క్లుప్తంగా

సర్వే టీంకు సహకరించాలి

న్యూశాయంపేట: హనుమకొండ జిల్లా పరిధి ధర్మసాగర్ మండలం ముప్పారం, వేలేరు మండలం ఎర్రవెల్లి, ఎల్కతుర్తి మండలం దామెర, భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామాల్లో ఇనుపరాతి గుట్టలోని ఫారెస్ట్ భూముల్లో నోటిఫై చేసిన సర్వే నంబర్లలో నోటిఫికేషన్ సెక్షన్ (4), ఫారెస్ట్ యాక్ట్ ప్రకారం ఫారెస్ట్ భూములు, డిమార్కేషన్, హద్దులు నిర్ణయించుటకు సోమవారం నుంచి సర్వే నిర్వహించనున్నట్లు హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫారెస్ట్ అధికారులతో కూడిన కమిటీ సర్వే నిర్వహిస్తుందని, సర్వే టీంకు రైతులు సహకరించాలని కోరారు.

టీఎస్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక


సామ్యనాయక్, కార్యదర్శి


వై.రాంబాబు, ఉపాధ్యక్షుడు


కిరణ్, జాయింట్ సెక్రటరీ

హన్మకొండ: తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. 2024 – 2027 వరకు ఈ కమిటీ కొనసాగుతుంది. టీఎస్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శిగా బి.సామ్యనాయక్, ఉపాధ్యక్షుడిగా వై.రాంబాబు, జాయింట్ సెక్రటరీగా టి.కిరణ్ ఎన్నిక కాగా, వారిని పలువురు అభినందించారు.

హనుమకొండ జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడిగా అమర్‌నాథ్



మడికొండ: హనుమకొండ జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడిగా కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన గుర్రం అమర్‌నాథ్ ఎంపికై నట్లు జిల్లా అధ్యక్షుడు బయ్యా స్వామి తెలిపారు. ఈమేరకు అమర్‌నాథ్‌కు ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మడికొండ: మడికొండలోని వినాయకనగర్‌కు చెందిన నార్లగిరి వనమాల ఇల్లు శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈమేరకు బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన రజక సంఘం సభ్యులు ఆదివారం రూ.12 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు గంగారపు యాదగిరి, పాండ్యాల సతీష్, రాజేష్, పెద్ద సారయ్య, ఆవునూరి రాజ్‌కుమార్, గంగారపు శ్రీధర్, ఎదులపురం కిరణ్, సాంబరాజు మధు, రవి, నార్లగిరి సతీష్, ఎలిశాల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

యువతి పెళ్లికి ఆర్థిక తోడ్పాటు



ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుతోట రాజు కుమార్తె వివాహం ఆదివారం జరిగింది. ఈమేరకు బీజేపీ రాష్ట్ర నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు రూ.లక్ష ఆర్థిక సాయంతోపాటు నూతన వధూవరులకు పట్టు వస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు. అలాగే, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు యువసేన ప్రతినిధులు వధువుకు రూ.55 వేలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కందిమల్ల మహేష్, కర్నె రవీందర్, తాబేటి వెంకట్‌గౌడ్, బోరిగం నాగరాజు, అర్జున్, రంజిత్, వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సీటీఐ కుటుంబానికి ఆర్థిక చేయూత



కాజీపేట రూరల్: అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందిన తెలంగాణ ఉద్యమ రైల్వే జేఏసీ నాయకుడు, రైల్వే సీటీఐ నాగరాజు కుటుంబ సభ్యులను తెలంగాణ రైల్వే జేఏసీ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.18 వేల ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు రైల్వే జేఏసీ కోంద్ర నర్సింగరావు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే జేఏసీ కోకన్వీనర్లు అనుమాల శ్రీనివాస్, జి.భాస్కర్, వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అన్నదమ్ములకు గ్రూప్-4 ఉద్యోగాలు

కమలాపూర్: ఓ కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు జోగు ఓంప్రకాష్, జోగు వంశీకృష్ణ గ్రూప్ -4 ఉద్యోగాలు సాధించారు. జోగు మల్లేశం – మాధవి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ సందర్భంగా వారితో పాటు వారి తల్లిదండ్రులను పలువురు అభినందించారు.

తెరుచుకోని గ్రంథాలయం

- శిథిలావస్థకు చేరిన భవనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- రెండేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాఠకులు, అభ్యర్థులు



మడికొండలోని గ్రంథాలయ భవనం


ర్యాక్‌లో పెట్టిన పుస్తకాలు, బల్లపై దినపత్రికలు


కూలిపోయిన గ్రంథాలయం గోడ

మడికొండ: రెండేళ్లుగా మడికొండలోని గ్రంథాలయం తెరుచుకోవడం లేదు. 30 ఏళ్ల క్రితం ఏర్పడిన గ్రంథాలయం గతంలో పాఠకులతో కళకళలాడేది. నేడు తెరిచే వారు లేక అది వెలవెలబోతోంది. లైబ్రరీకి కనీసం విద్యుత్ సరఫరా కూడా లేదు. భవనం సైతం శిథిలావస్థగా చేరింది. అందులోని పుస్తకాలు వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతున్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన లైబ్రేరియన్ మరోచోటుకు బదిలీ అయ్యారు. దాంతో లైబ్రరీ నిత్యం మూసే ఉంటోంది. ఇన్‌చార్జ్‌ను కేటాయించినా ప్రయోజనం లేదు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు కాజీపేట, హనుమకొండ, వరంగల్ గ్రంథాలకు వెళ్తున్నారు. దినపత్రికలు చదివేవారు సెలూన్లు, షాపులను ఆశ్రయిస్తున్నారు. గ్రంథాలయ నిర్మాణానికి అధికారులు, పాలకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లైబ్రరీ భవనం నిర్మించాలి



మడికొండలోని లైబ్రరీ భవనం శిథిలావస్థకు చేరింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త భవనాన్ని నిర్మించాలి. అందుబాటులో గ్రంథాలయం లేకపోవడంతో పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– దువ్వ సందీప్, స్థానికుడు

బొడ్రాయి వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తాం


బొడ్రాయి వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు, తదితరులు

ఖిలా వరంగల్: ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు పడమర కోటలో గ్రామ దేవత బొడ్రాయి ఐదో వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఇనుముల మల్లేశం, బైరబోయిన దామోదర్, సాగర్ల శ్రీనివాస్, గజ్జెల శ్యామ్ తెలిపారు. ఈమేరకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన బొడ్రాయి వార్షికోత్సవ కరప్రతాలను ఖిలా వరంగల్ పడమరకోట జంక్షన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24న గోపూజ, గణపతి పూజ, రావిచెట్టు చుట్టూ ప్రదక్షిణ, పుణ్యాహవచనం, కంకణధారణ, అఖండ దీపారాధన, నవగ్రహ, వాస్తు, యోగిని, క్షేత్రపాల సర్వతోభద్ర మండప, ఆరాధనలు, మహాగణపతి, నవగ్రహ స్థాపిత దేవతా హోమాలు, మహా పూర్ణాహుతి, 25న మహాలక్ష్మి పూజలు, కుంకుమార్చన, 26న స్థాపిత దేవతా పూజలు, భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి గ్రామదేవతకు అలంకరణ, హారతి, మంత్రపుష్పం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందని ఉత్సవ కమిటీ ప్రతినిధులు వివరించారు.

రేపు కులగణన - సామాజిక న్యాయంపై రాష్ట్రస్థాయి సదస్సు

కేయూ క్యాంపస్: తెలంగాణ పూలే ఆశయ సాధన సమితి (పాస్) ఆధ్వర్యంలో కులగణన – సామాజిక న్యాయం అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సును కాకతీయ యూనివర్సిటీలోని ఎస్‌డీఎల్‌సీఈ జర్నలిజం విభాగం సెమినార్ హాల్‌లో ఈనెల 19న ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు పూలే ఆశయ సాధన సమితి అధ్యక్షుడు, సదస్సు నిర్వాహకుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ తెలిపారు. సదస్సులో ముఖ్యఅతిథిగా, ప్రధాన వక్తగా తెలంగాణ విద్యా కమిషన్ మెంబర్, ప్రొఫెసర్ పీఎల్.విశ్వేశ్వర్ రావు, విశిష్ట అతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ అతిథిగా ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్, సామాజిక ఉద్యమకారులు ప్రొఫెసర్ వెంకటనారాయణ పాల్గొంటారని మల్లేశ్వర్ వివరించారు.

మనోహర్‌కు టీచర్ ఇన్‌స్పిరేషన్ అవార్డు


అవార్డు అందుకుంటున్న మనోహర్

హసన్‌పర్తి: 56వ డివిజన్‌లోని ఎస్‌వీఎస్ కాలనీకి చెందిన అనుమాండ్ల మనోహర్.. టీచర్ ఇన్‌స్పిరేషన్ అవార్డు -24కు ఎంపికయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమలో శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్‌కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. గణిత సబ్జెక్ట్‌లో మెలకువలు, గణితాన్ని సులువుగా బోధిస్తున్నందుకు ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు. కాగా, ప్రస్తుతం మనోహర్ సంగెం మండలం మొండ్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

మాలతికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో పరిశోధకురాలు బి.మాలతికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. కస్టమర్ సాటిస్ఫ్యాక్షన్ అండ్ లాయలిటీ ఇన్ రిటైయిల్ స్టోర్స్ – ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ అవుట్‌లెట్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మాలతికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో మాలతి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. మాలతి వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చంద్రుగొండ గ్రామానికి చెందినవారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థి ప్రతిభ


చిన్నారిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్

ఖిలా వరంగల్: ఇటీవల గోవాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి జూనియర్ కరాటే పోటీల్లో శంభునిపేటలోని రెనార్డ్స్ హైస్కూల్ విద్యార్థిని తండ వినిశ్రిత పాల్గొని బంగారు పతకం సాధించింది. ఈ మేరకు రెనార్డ్స్ హైస్కూల్‌లో ఆదివారం జరిగిన అభినందన సభలో వినిశ్రితను ప్రిన్సిపాల్ నామాల శ్రీధర్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి జూనియర్ కరాటే పోటీల్లో అండర్ -9 విభాగంలో పాఠశాల నుంచి పాల్గొని పతకం సాధించడం హర్షణీయమని ప్రశంసించారు. ఏజీఎం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో వినిశ్రిత మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీధర్, చైర్మన్ శ్రీవిద్య, కోఆర్డినేటర్ అశ్విని, ప్రైమరీ ఇన్‌చార్జ్ షకీల, కావ్య మరాఠీ, డీన్ కిరణ్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో సినీహీరో విశ్వక్‌సేన్



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని సినీహీరో విశ్వక్‌సేన్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఆయనకు అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి మహదాశీర్వచనం చేశారు.

గ్రంథాలయ చైర్మన్లకు సన్మానం



కాజీపేట రూరల్: హనుమకొండ, జనగామ జిల్లాల గ్రంథాలయ చైర్మన్లుగా ఎంపికైన అజీజ్‌ఖాన్, మారజోడు రాంబాబును కాజీపేట 47వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు హనుమకొండలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. మైసారపు సిరిల్‌లారెన్స్, రాంబాబు, సిలువేరు విజయభాస్కర్, రాజ్‌కుమార్, భూషపాక శ్రీనివాస్, పోగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు సన్మానం


క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

హసన్‌పర్తి: ఈనెల 22, 23వ తేదీల్లో తమిళనాడులో జరగనున్న సౌత్ ఇండియా నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు హనుమకొండ జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ సంగాల కమల్ తెలిపారు. వస్కుల నిశావంత్ (57 కిలోల విభాగం), పవన్ (74 కిలోల విభాగం), సిద్దబోయిన ప్రణయ్ 105 కిలోల విభాగంలో పాల్గొననున్నారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అభినందించారు. ఈమేకు క్రీడాకారులు, కోచ్‌ను పలువురు సన్మానించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని రుద్రమాంబనగర్‌లో వరంగల్ జిల్లా టీడీపీ పార్లమెంట్ కన్వీనర్ నల్లకుంట రవికుమార్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా టీడీపీ నేత జీఎల్ శ్రీధర్ హాజరై సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. టీడీపీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో నాగవెల్లి సురేష్, బరిగల సుధాకర్ పాల్గొన్నారు.

అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి కృషి


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

ఖిలా వరంగల్: వరంగల్ ఉమ్మడి వరంగల్ జిల్లా లారీ సప్లయర్స్ అసోసియేషన్ సభ్యుల సంక్షేమాభివృద్ధితోపాటు అసోసియేషన్‌కు పూర్వవైభవం వచ్చేలా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు వంగాల సమ్మిరెడ్డి హామీ ఇచ్చారు. వరంగల్ హంటర్ రోడ్డులోని అసోసియేషన్ భవనంలో ఎన్నికల అధికారి చకిలం ఉపేందర్ ఆధ్వర్యంలో అడ్‌హక్ కమిటీ ప్రతినిధులు మెంగని సదానందం, తోట దేవేందర్, కందిమళ్ల భాస్కర్‌రావు, వెలిశాల శ్రీనివాస్‌రావు, ఇంజమూరి సూర్యనారాయణ నేతృత్వంలో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈమేరకు అధ్యక్షుడిగా వంగాల సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొండా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ హిమయతుల్లా (బాబర్), కోశాధికారిగా దాసరి నాగరాజు, జాయింట్ సెక్రటరీగా మందాటి రవీందర్, కార్యవర్గ సభ్యులుగా తాళ్ల కుమార్, బాసాని రామకృష్ణ ఎన్నిక కాగా, వారికి ఎన్నికల అధికారులు నియామక పత్రాలు అందజేశారు.

రేషన్ బియ్యం ఇవ్వరా?

ఐనవోలు: నవంబర్ నెలకు సంబంధించిన రేషన్ బియ్యం లబ్ధిదారులకు అందని పరిస్థితి మండలంలోని 13 రేషన్ షాపుల్లో చోటు చేసుకుంది. సాధారణంగా ప్రతినెలా 1నుంచి 17వ తేదీ వరకు గ్రామాల్లో రేషన్ బియ్యం డీలర్లు రేషన్ కార్డుదారులకు అందజేస్తారు. గడువు ముగిసినప్పటికీ.. ఇప్పటి వరకు కూడా నందనం, రాంనగర్, లింగమోరిగూడెం, ఉడుతగూడెం, గర్మిళ్లపెల్లి, కక్కిరాలపల్లి, పెరుమాండ్లగూడెం, పంథిని, ఐనవోలు గ్రామాల పరిధిలోని 13 రేషన్ షాపులకు బియ్యం అందలేదు.

సీపీ స్టార్ టాలెంట్ టెస్ట్‌కు స్పందన



కాజీపేట అర్బన్: న్యూశాయంపేటలోని కోటా రాజస్థాన్ కెరీర్ పాయింట్ వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సీపీ స్టార్ టాలెంట్ 25కు విశేష స్పందన లభించిందని బ్రాంచ్ చైర్మన్ జూలపల్లి కరుణాకర్‌రావు తెలిపారు. 892 మంది పదవ తరగతి విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌కు హాజరైనట్లు వివరించారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లతో పాటు రివార్డులు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేందర్, డైరెక్టర్ మధుపాల్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ప్రయోజనాలు అనేకం


వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న శశిజా దేవి, తదితరులు

రామన్నపేట: పుస్తకాలు చదవడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి శశిజాదేవి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నాల్గో రోజు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యం, సైన్స్, ఆర్థిక, సామాజిక, సాహిత్య ఇలా అనేక విభాగాలకు సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయంలో ఉన్నాయని వివరించారు. వాటిని పుస్తక ప్రియులు సద్వినియోగించుకోవాలని సూచించారు. సోమవారం 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 10.30 గంటలకు క్విజ్ పోటీ, మధ్యాహ్నం 1.30 గంటలకు కవి సమ్మేళనం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ ఎంఈఓ జి.అశోక్‌కుమార్, చిన్నబాబు, శ్రీధరాచార్యులు, లైబ్రేరియన్లు రాంచందర్, పద్మారావు, గ్రంథాలయ సిబ్బంది లలిత, రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

న్యూశాయంపేట: ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరంతర రాజకీయ పాఠశాలను ఆదివారం ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రజా ఉద్యమాలను నిర్మించి ప్రజల మధ్యన ఉండి వారిని చైతన్యపరుస్తూ ప్రశించే గొంతుకగా సీపీఐ పోరాటం చేస్తోందని వివరించారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు టి.భిక్షపతి, ఎల్లేశ్, లక్ష్మణ్, ఎం.భిక్షపతి, రాజమౌళి, సదానందం, సారంగపాణి, రమాదేవి, శంకర్‌నాయక్, రవి, వెంకటేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటాం


నిరసన తెలుపుతున్న నాయకులు

హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలో దాదాపు రూ.100 కోట్ల వ్యంతో నిర్మించిన కళాక్షేత్రంలో కళాకారులకు స్థానం లేకుండా, కళాకారుల విగ్రహాలు ఏర్పాటు చేయకుండా ఆవిష్కరణకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటామని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, ఎస్ఐఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ హెచ్చరించారు. ఈనెల 19న సీఎం పర్యటన సందర్భంగా హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళలు, కళారూపాలకు సంబంధం లేని కాళోజీ నారాయణరావు పేరు పెట్టడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కళాక్షేత్రంలో కళాకారుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని, కళాక్షేత్రానికి కళాకారుల పేర్లు పెట్టాలని నాలుగు నెలలుగా ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించినా ఫలితం లేదని వాపోయారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా స్టూడెంట్ ఆర్గనైజేషన్, తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు జరిపోతుల వంశీకృష్ణ, అక్రం, కుమార్, నాని, అర్జున్, ప్రణయ్, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పాలన మోసపూరితం'


మాట్లాడుతున్న రిజ్వానా షమీమ్

న్యూశాయంపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీది ప్రజాపాలన కాదని, మోసపూరిత పాలన అని వరంగల్ నగర డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ విమర్శించారు. వరంగల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నగరంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవ సభ కాదని, దోపిడీదారుల కాంగ్రెస్ సభ అని ఆరోపించారు. ఎన్నికల హామీలను నెరవేర్చని సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే సభను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని రిజ్వానా షమీమ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు సయ్యద్ మసూద్, అబ్దుల్, తదితరులు పాల్గొన్నారు.

24న కార్తీక వనభోజన మహోత్సవం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ చౌరస్తా: ధర్మసాగర్ మండల కేంద్రంలోని రిజర్వాయర్ కట్టపై నూతనంగా నిర్మిస్తున్న శ్రీభక్త మార్కండేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఈనెల 24న ఉదయం కార్తీకమాస వనభోజన మహోత్సవాన్ని హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయంలో మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పద్మశాలి కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వనభోజన కరపత్రాలను ఆవిష్కరించారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్‌రెడ్డి

కాజీపేట అర్బన్: వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలని ఐఎంఏ జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్‌రెడ్డి సూచించారు. 31వ డివిజన్ న్యూశాయంపేటలోని ఆకృతి అవెన్యూ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిరువరంగం ప్రభాకర్, శ్రీధర్, దేవేందర్ రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి ఎమ్మెల్యే చేయూత

ఐనవోలు: మండలంలోని వనమాల కనపర్తి గ్రామానికి చెందిన సింగారపు లాస్య ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్ ఎన్ఐటీలో ఇంజనీరింగ్ సీటు సాధించింది. కళాశాల ఫీజు కట్టలేని పరిస్థితిలో ఉండటంతో స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును సుబేదారిలోని ఆయన నివాసంలో లాస్య ఆదివారం కలిసింది. స్పందించిన ఎమ్మెల్యే రూ.లక్ష, తన మిత్రుడు కరణ్‌రాజు ద్వారా మరో రూ.లక్ష అందించారు. అదేవిధంగా ఎమ్మెల్యే సూచనల మేరకు అక్కడ ఉన్న నాయకులు తమకు తోచిన సాయం చేశారు. ఈమేరకు ఎమ్మెల్యే, నాయకులకు లాస్య, ఆమె తల్లి విమల కృతజ్ఞతలు తెలిపారు.